సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

ధరల దరువు

నిత్యావసర సరకుల ధరలు దడ పుట్టిస్తున్నాయి. వంట నూనెలు సలసలా కాగుతున్నాయి. కూరగాయలు ధరలు అధరహో అనిపిస్తున్నాయి.. పప్పులు పొయ్యిమీద పెట్టకుండానే ఉడికిపోతున్నాయి. ధరలన్నీ మండిపోవడంతో సామాన్య ప్రజలు ఏం కొంటాం.. ఏం తింటాం అంటూ నిట్టూర్చుతున్నారు. పెరిగే ధరలకు హద్దేలేదా అని ప్రశ్నిస్తున్నారు. ప్రజల కష్టాలు పాలకులకు పట్టవా అని మండిపడుతున్నారు.






ధరలు పెరుగుదలతో వెలవెల బోతున్న పెదగంట్యాడ రైతు బజార్

పెదగంట్యాడ: పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. నిత్యావసర సరకులతో పాటు పప్పులు, వంటనూనెలు, కూరగాయల ధరలు నిరంతరం పెరుగుతున్నా కనీస నియంత్రణ చర్యలు చేపట్టడం లేదు. దీంతో రోజురోజుకూ ధరలు నింగిని తాకుతున్నాయి. ఫలితంగా పేద, మధ్య తరగతి ప్రజలు మూడు పూటలా భోజనం చేయడం గగనమవుతోంది.

కాగుతున్న నూనెలు

వంట నూనెలు సలసలకాగుతున్నాయి. రిఫైండ్ ఆయిల్ మాట అటుంచితే.. పామాయిల్ ధర కూడా కొండెక్కి కూర్చొంది. పామాయిల్ లీటరు రూ.135 కాగా రిఫైండ్ ఆయిల్ రూ.155కి చేరింది. దీంతో సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు. కేంద్ర పభుత్వం దిగుమతులపై సుంకం లీటర్‌కు రూ.20 నుంచి రూ..25 వరకూ పెంచడంతో ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

పప్పులు కుతకుత

గతంలో ఎన్నడూ లేని విధంగా పప్పుల ధరలు కుతకుతలాడుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏకధాటిగా పెరుగుతున్నాయి. కిలో కంది పప్పు రూ.195 కాగా మినపపప్పు కిలో రూ.150, శనగ పప్పు రూ.100, పెసరపప్పు రూ.140, వేరుశనగ కిలో రూ.140 కి చేరాయి.

కూర గగనమే



పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్నాం. గతంలో కిలోల లెక్క కొనుగోలు చేసే వాడిని. ఇప్పుడు ఏ పూటకు ఆ పూటే అన్నట్టు కొంటున్నాను. మూడుపూటలా కూరతో భోజనం చేసి చాలా రోజులైంది. కూలి కళ్తే గాని పూట గడవని పరిస్థితి. మార్కెట్లో నిత్యావసర వస్తువులు, వంట నూనెలు, కూరగాయాలు ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ప్రభుత్వం స్పందించి ధరలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. సామాన్య ప్రజలను ఆదుకోవాలి.

–ఇందల దేముడు, కార్మికుడు, పెదగంట్యాడ

కొండెక్కిన కూరగాయలు

ఒక పక్క పప్పులు.. మరో పక్క నూనెల ధరలు దడదడలాడిస్తుంటే.. కూరగాయల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. కిలో వంకాయలు రూ.60 కాగా బెండ కాయలు రూ.60, క్యారెట్ రూ.90, ఉల్లిపాయలు కిలో రూ.70, బంగాళదుంపలు రూ.60, మిగతా ఏ కూరగాయలు చూసినా రూ. 60 నుంచి రూ.100 వరకూ అమ్ముతున్నారు.

ధరలు ఇలా.. (కిలో/లీటర్)

వస్తువులు	నెల కిందట	ప్రస్తుతం
కంది పప్పు	రూ.170	రూ.195
మినప పప్పు	రూ.130	రూ.140
పెసరపప్పు	రూ.120	రూ.130
శనగపప్పు	రూ.90	రూ.100
వేరుశనగ	రూ.120	రూ.140
పామాయిల్	రూ.110	రూ.135
రిఫైండ్ ఆయిల్	రూ.135	రూ.155
క్యారెట్	రూ.50	రూ.90
ఉల్లిపాయలు	రూ.30	రూ.60
బంగాళాదుంపలు	రూ.30	రూ.60
టమాటా	రూ.30	రూ. 60

దళారుల ఇష్టారాజ్యం



సరుకుల ధరలను దళారులు తమకు ఇష్టమొచ్చినట్టు పెంచేస్తున్నారు. దీని కారణంగా సామాన్యులపై భారం పడుతోంది. పండగలు వచ్చినా పిండి వంటలు చేసుకోలేని పరిస్థితి. దళారులు సిండికేట్ కావడంతో ఈ పరిస్థితి నెలకుంటోంది. ధరలను నియంత్రించాల్సిన వారే వారికి అండగా నిలుస్తున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఎలా జీవించాలి. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించేలా పాలకులు చర్యలు చేపట్టాలి. అధిక ధరల నుంచి విముక్తి కలిగించాలి.

– సి.పూర్ణ, నెల్లిముక్కు

ఏం కొంటాం.. ఏం తింటాం..



ధరలు రోజు రోజుకూ పెరిగిపోతుంటే ఏం కొంటాం.. ఏం తింటాం.. గతంలో ప్రతి రోజూ కూరలతో భోజనాలు చేసేవాళ్లం. ఇప్పుడు పచ్చడితో సర్దుకునే పరిస్థితి నెలకొంది. పేద, మధ్య తరగతి ప్రజల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నిత్యావసరాలు, నూనెలు, పప్పుల ధరలు అదుపులో ఉంచేలా ప్రభుత్వాలు కృషి చేయాలి.

– పి.పైడమ్మ, పెదగంట్యాడ

క్లుప్తంగా

పని చేయని కోచ్ ఇండికేటర్లు
ఇబ్బందులకు గురైన ప్రయాణికులు


నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు పనిచేయని కోచ్ ఇండికేటర్లు

అగనంపూడి: ఎక్కాల్సిన రైలు రానే వచ్చింది.. కానీ కోచ్ ఇండికేటర్లు పనిచేయక పోవడంతో వారు ఎక్కాల్సిన కోచ్ ఎక్కడ ఆగుతుందో తెలియక దువ్వాడ రైల్వేస్టేషన్‌లో రైలు ప్రయాణికులు లగేజీలతో పరుగులు తీశారు. గుంటూరు నుంచి రాయగడ మధ్య నడుస్తున్న రైలు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో నాలుగో నంబర్ ప్లాట్‌ఫారంపై ఆగింది. అయితే ప్లాట్‌ఫారంపై ఉన్న కోచ్ ఇండికేటర్లు పనిచేయకపోవడంతో ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు. ఉరుకులు పరుగులతో కోచ్‌లో ఉన్న ప్రయాణికులను వాకబు చేసుకొని రైలు ఎక్కి ఊపిరి పీల్చుకున్నారు.

ఉక్కు ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలి


ఉక్కు ఆస్పత్రి మెడికల్ అడ్మిన్ డాక్టర్ గౌతమ్‌ను సత్కరిస్తున్న నాయకులు, వైద్యులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు కోరారు. ఆస్పత్రి మెడికల్ అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జిగా నియమితులైన డాక్టర్ ప్రశాంత కుమార్ గౌతమ్‌ను సోమవారం జనరల్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ రామ సత్యంతో కలిసి శాలువా కప్పి అభినందించారు. ఆస్పత్రి డిస్పెన్సరీలో చాలా మందులు అందుబాటులో ఉండడం లేదన్నారు. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది నియామకంతో పాటు అన్ని మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కె. గోపాలకృష్ణ, జోయన్న, లక్ష్మణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్‌కు ఘన సన్మానం


వల్లభాయ్ పటేల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: ఏపీ పరిశ్రమల శాఖ అదనపు విశ్రాంత డైరెక్టర్ అప్పికట్ల వల్లభాయ్ పటేల్‌ను షీలానగర్‌కు చెందిన అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ (యాక్ట్) ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అమరావతి ప్రధాన కార్యాలయంలో పదవీ విరమణ చేసిన అనంతరం మొదటి సారి విశాఖకు వచ్చిన ఆయనకు యాక్ట్ ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువా కప్పి సత్కరించారు. అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేశారు. యాక్ట్ వ్యవస్థాపకుడు ఆళ్లమూడి ప్రభాకరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రతినిధులు గాదెలవర్తి రాణి, రత్నప్రభ, కటారి కార్తీక్, ముళ్లపూడి సునీల్ పాల్గొన్నారు.

గౌరీ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

గాజువాక: శ్రీనగర్ గౌరీ సేవా సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మళ్ల బాపునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడిగా మళ్ల సోమేశ్వరరావు,అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కాండ్రేగుల రఘురామ్, కోరిబిల్లి వెంకట నాయుడు, కోశాధికారిగా కాళ్ల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

హయ్యర్ పెన్షన్ కోసం పోరుబాట


సమావేశంలో ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ ట్రస్ట్ చైర్మన్ ఝూ

• రిటైర్డ్ ఉద్యోగుల నిర్ణయం
• వారంలోగా తాత్కాలిక కమిటీ ఏర్పాటు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ అంశాన్ని ఈపీఎఫ్‌వో జాప్యం చేయడంపై రిటైర్డ్ స్టీల్ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశంపై పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఉద్యమ కార్యాచరణ కోసం వారంలోగా తాత్కాలిక కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం ఉక్కునగరంలోని సీ భవన్‌లో సమావేశమైన రిటైర్డ్ స్టీల్ ఉద్యోగులు తీర్మానించారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ 2022 నవంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు విశాఖలోని ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయం సెప్టెంబర్ 2023లో 2984 మంది అర్హత కలిగిన ఉద్యోగులకు డిమాండ్ నోటీసులు జారీ చేసిందన్నారు. అందులో 1800 మంది సుమారు 410 కోట్లు డిపాజిట్ చేశారన్నారు. 2024 మార్చిలో పదవీ విరమణ చేసిన 10 మందికి పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ పెన్షన్ జమ కాలేదన్నారు. 14 నెలలుగా ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఈపీఎఫ్‌వో ప్రధాన కార్యాలయంలో పెండింగ్‌లో ఉందన్నారు. జనవరిలోగా పూర్తి పెన్షన్ అమలు చేయకుంటే మళ్లీ సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్టీల్ ప్లాంట్ పీఎఫ్ ట్రస్ట్ చైర్మన్ హెచ్‌కే ఝూ, సీ అధ్యక్షులు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, రిటైర్డ్ అధికారి వాసమూర్తి, సీ మాజీ అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు,

కన్వీనర్లు కుమారస్వామి, ద్వారం స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంశీరెడ్డి జన్మదిన వేడుకలు


వంశీరెడ్డితో కేక్ కట్ చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి,చింతలపూడి, గురుమూర్తిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పెదగంట్యాడ జంక్షన్‌లోని ఆయన స్వగృహంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా ఆయనతో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి కేక్ కట్ చేయించారు. పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వంశీరెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

మరీ ఇంత 'చెత్త' రోడ్డా!


వాకింగ్ ట్రాక్ - శనివాడ మధ్య రోడ్డుకిరువైపులా చెత్త కుప్పలు

డంపింగ్ యార్డును తలపిస్తున్న ఉక్కు జనరల్ ఆస్పత్రి రోడ్డు

అగనంపూడి: అగనంపూడి నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రికి వెళ్లే మార్గం చెత్తమయంగా మారింది. శనివాడ కూడలి నుంచి ఏలేరు కాలువ వరకు సుమారు అరకిలోమీటరు దూరం వరకు రహదారి కిరువైపులా చెత్త పోగులు గుట్టలు గుట్టలుగా పేరుకుపోయాయి. వాకింగ్ ట్రాక్ వద్ద టన్నుల కొద్దీ చెత్తాచెదారం చెల్లాచెదురుగా పడి ఉంది. ఉదయం, సాయంత్రం అగనంపూడి పరిసర ప్రాంతాల నుంచి నిర్వాసితకాలనీల నుంచి 500 మంది వరకు వాకింగ్ ట్రాక్‌ను వినియోగిస్తున్నారు. ఇదే మార్గంలో స్టీల్‌ప్లాంట్, సెక్టార్లు, పాఠశాలలకు వేలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గంలో అపారిశుధ్యం తాండవిస్తోంది. రోడ్డుకు రెండువైపులా స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగం సేకరించిన ఉక్కు భూములు ఉండడంతో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది చెత్తను ఇక్కడ డంపింగ్ చేస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. జీవీఎంసీ అధికారులు మాత్రం చెత్తకుప్పలను కనీసం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విశాఖ ఉక్కు పరిసరాల విభాగం, జీవీఎంసీ అధికారులు స్పందించి చెత్త కుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


ఏలేరు కాలువపై చెత్త పోగులు

స్కిల్ హబ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గాజువాక ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 16లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పదోతరగతి, ఆపై చదువుకున్న అభ్యర్థులు 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. 30 సీట్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8121743777 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కళా ఉత్సవ్‌లో నడుపూరు విద్యార్థుల సత్తా


మూకీ అభినయంలో సత్తా చాటి అర్హత పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు


ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్

పెదగంట్యాడ: కళా ఉత్సవ్ పోటీల్లో నడుపూరు జిల్లా పరిషత్ విద్యార్థులు సత్తా చాటారు. ఆరు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో మూడు విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పాఠశాల నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. మ్యూజిక్‌లో నందు స్నేహిత, మోడల్ మేకింగ్ 3డీ ఆర్ట్‌లో ఇంద్ర కిరణ్, మూకీ అభినయంలో తరుణ్, చరణ్, మనోహర్, సాయికుమార్, భరత్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. గతేడాది ఫోక్ డ్యాన్స్‌లో జాతీయ స్థాయిలో కూడా సత్తా చాటారని గుర్తు చేశారు. విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు మాధవి, సుగుణ, శోభను ఆయన అభినందించారు.

స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి పెంచడానికి సహకరించండి


స్టీల్‌ప్లాంట్ నూతన వర్క్స్ సీజీఎం మొహంతిని సత్కరిస్తున్న ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి పెంచడానికి ఉద్యోగులంతా సహకరించాలని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) రంజన్ మొహంతి కోరారు. నూతన సీజీఎం (వర్క్స్)గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఆయన్ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సీజీఎం మాట్లాడుతూ బ్లాస్ట్‌ఫర్నేస్‌లు రెండింటి నుంచి రోజుకు 15 వేల టన్నుల హాట్ మెటల్, ఎస్.ఎం.ఎస్‌ల నుంచి 110 హీట్ల సాధనకు యాజమాన్యం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. వాటి సాధనకు ఉద్యోగులంతా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను నూతన సీజీఎం దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.తౌడన్న, బయ్యే మల్లయ్య, ఎస్. సత్యనారాయణ, మోహన్‌బాబు, పుల్లారావు, సాయిప్రసాద్, ఫణీంద్రబాబు, వరప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్ ఏర్పాటు చేయాలని వినతి

అగనంపూడి: అగనంపూడిలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్‌కు అగనంపూడికి చెందిన నాయకులు వినతిపత్రం అందించారు. అగనంపూడిలో రైతు బజార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు జరిగాయని, అప్పట్లో స్థలాన్ని కూడా కేటాయించారని వారు పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో బి.సత్యనారాయణ, బి.చందు, జి.పద్మ తదితరులు ఉన్నారు.

జీతాల కోసం ఐఎన్‌టీయూసీ ధర్నా నేడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాలు చెల్లించాలనే డిమాండ్‌తో మంగళవారం స్టీల్ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్టు స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు తెలిపారు. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల జీతాలు చెల్లించాలని ఆ రోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమంలో పాల్గోవాలని ఆయన కోరారు.

ఆలయానికి ఫ్యాన్లు, ట్యూబు లైట్ల అందజేత


ఫ్యాన్లు, ట్యూబు లైట్లు అందజేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న గిరిపై కొలువైన ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి దాతలు తమ సహకారం అందజేస్తున్నారు. సోమవారం గాజువాకకు చెందిన కులుకూరి మంగరాజు, అతని కుమారుడు కలుకూరి సుమంత్, కుమార్తె లక్ష్మీ ప్రత్యూష 10 సీలింగ్ ఫ్యానులు, 10 ట్యూబ్ లైట్లను ఆలయ మాజీ కమిటీ చైర్మన్ గండ్రెడ్డి రామునాయుడు, ప్రతినిధుల సమక్షంలో అందజేశారు. కులుకూరి మంగరాజు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఇప్పటి వరకు 40 ట్యూబ్ లైట్లను అందజేశానని, తిరిగి ఇప్పుడు మరో 10 ట్యూబ్ లైట్లు అందజేయడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో కేసరపు శ్రీను, నంబూరి జగన్నాథం, కేసరపు సతీష్, సిరసపల్లి ఈశ్వరరావు, చరగడం రాము, చీమకుర్తి శ్రీనివాసరావు, గుండా శరత్‌చంద్ర గుప్తా, కడిమిశెట్టి దేవ వరప్రసాద్, గుర్రాల శ్రీనివాసరావు, కూర రమేష్, ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణాచార్యులు పాల్గొన్నారు.

16 నుంచి ధనుర్మాస పూజలు


ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్నాయి. జనవరి 13 వరకు ప్రతీ రోజు గోత్రనామార్చన, గోదాదేవికి సుప్రభాత సేవ, ఆరాధన, తిరుప్పావై, అర్చన, మంగళశాసనం, పాశురవిన్నపం నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా జనవరి 3న ఉదయం 5.30 గంటలకు కుత్తువిళక్, 5న మధ్యాహ్నం 3 గంటలకు తిరువీధి రథోత్సవం, 8న ఉదయం 5.30 గంటలకు కర్పూర హారతి ఇవ్వనున్నారు. జనవరి 9 నుంచి 13 వరకు గోదాదేవికి ఉదయం అభిషేకం, తోమాల సేవ, అలంకారం నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 4.30 నుంచి భక్తులకు స్వామి ఉత్తర ద్వారంలో దర్శనం ఇవ్వనున్నారు. 11న శనివారం కూడారై ఉత్సవం, 13న సాయంత్రం గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

దివ్యాంగుల క్రికెట్ టోర్నీ ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం: దివ్యాంగుల రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు స్థానిక జింక్ మైదానంలో సోమవారం ప్రారంభమయ్యాయి. వందేభారత్ బ్లడ్ సెంటర్ మద్దతుతో ఉరుకూటి చైతన్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను దుర్గా దేవాలయం చైర్మన్ ఆకుల అప్పలసూరి, ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు నారాయణ్, కార్యదర్శి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు దివ్యాంగ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ మద్దతుగా నిలవాలన్నారు. పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 10 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు బాటా శ్రీను, వందేభారత్ బ్లడ్ సెంటర్ నిర్వాహకుడు వినోద్ బాలు, ప్రముఖ న్యాయవాది లీలా ప్రసాద్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
7997958388, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
9912222749, 9705347420, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com